# సినిమా స్టార్

గోకుల్ బొంబాయికి రావడం అదే మొదటిసారి. అతనికి బొంబాయిలో చాలా మంది స్నేహితులు ఉన్నారు. వినికిడిగా అతనా పట్టణం గురించి చాలా విన్నాడు. అధికార రీత్యా అతను బొంబాయికి రావడం వ్యాపారంలో అన్నగారికి సహాయ పడటానికే అయినప్పటికీ, అతని మనసులో ఇంకా కోరికలు ఉన్నాయి.

అతను కొద్దికాలం క్రితమే చదువు పూర్తిచేసాడు. అతనిలో ఉన్న రొమాంటిసిజం ఏదో ఒక రూపంలో బయటికి రావాలని తన్నుకుంటున్నది. దానికి బొంబాయి మంచి అవకాశం ఇస్తుందని అతని నమ్మకం.

రొమాంటిసిజం అంటే ఎవరో వీధిలో కనిపించిన స్త్రీని ప్రేమించి, వెంటాడి, జయించి, పెళ్లాడటం కానే కాదు, గోకుల్ అంచనా ప్రకారం సామాన్య మానవులు పాటించే నియమాలను తోసేసి, ఇతరులను బాధించకుండా, తన మనస్సుకు ఆనందం కలిగేట్టుగా స్వేచ్ఛగా ప్రవర్తించటం.

మామూలు మనుషులు నియమం ప్రకారం నిద్రపోతారు, లేస్తారు, తిండి తింటారు, పనిచేస్తారు, వినోదాలు నియమానికి కట్టుబడే చూస్తారు. గోకుల్‌కి ఇది చాలా హేయంగా తోచింది. తన అన్నగారంటే అతనికి మరీ ఎగతాళి. ఆయన పెద్ద వ్యాపారమే చేస్తున్నాడు. కాని ఏం లాభం? కీ ఇచ్చిన గడియారం లాగా ఒక నియమానికి కట్టుబడి ప్రతి పనీ చేస్తాడు. ఆయనకి ఆవగింజంత స్వేచ్ఛ కూడా అవసరం లేదు. అదేం జీవితం? డబ్బు కోసం కొంచెం స్వేచ్ఛ పోగొట్టుకోక తప్పదని గోకుల్ కూడా ఒప్పుకున్నాడు. కాని డబ్బుతో పాటైనా స్వేచ్ఛ సంపాదించుకోని జీవితాలేం జీవితాలు?

బొంబాయిలో కూడా కొంతకాలం ఉండి ఒక సమాజంలో పడిపోయిన మనిషి ఆ సమాజ నియమాలకు కట్టుబడి పోవలసిందే. కొత్తగా వచ్చేవారికి కొంతకాలం అంతులేని స్వేచ్ఛ. దాన్ని దక్కించుకుందామని గోకుల్ నిర్ణయించుకున్నాడు. అందుకనే తన రాక గురించి అన్నగారికి ఒక్కముక్కైనా రాయలేదు. ఒకటి రెండు వారాలు బొంబాయిలో ఒంటరిగా గడిపి, తన ఇష్టం వచ్చిన చోట తిని, మైదానాల్లోనో, బీచిల్లోనో పడుకొని, సరదా పుడితే అడుక్కుని, మూటలు మోసి అవసరమైనంత అనుభవమూ

సంపాదించుదామని అతని ఆశ. ఏనాడు తనకు స్వేచ్ఛ మీద మొహంమొత్తితే ఆనాడు మూల్జాతా మార్కెట్టుకు వెళ్ళి తన అన్నగారిని కలుసుకొని, "అన్నయ్య వచ్చా" అనవచ్చు...

రైలు విక్టోరియా స్టేషనులోకి వచ్చి ఆగింది. ఆ జనాన్నీ, అడావుడినీ చూస్తూ, గోకుల్ కాసేపు ప్లాట్‌ఫారం మీద నిలబడిపోయినాడు. అతని సామాను దింపిన పోర్టరు అతనిని హెచ్చరించాడు.

"బాబూ, సామాను!"

"సామాను ఉంచేటందుకిక్కడ ఏర్పాటున్నదిగా?" అన్నాడు గోకుల్.

పోర్టరు దారి చూపించగా గోకుల్ ముందుకు సాగాడు.

"ఎక్కడికి పోతారు? హోటలుకా?"

గోకుల్ తిట్టుతిన్నవాడల్లే తనను పలకరించిన వాడికేసి తిరిగి, "మధ్య నీ అడావిడి ఏమిటి నాకు?" అన్నాడు.

'హోటల్లో బస చెయ్యదలచుకుంటే మా హోటలు చాలా బాగుంటుంది" అంటూ అతన్ని పలకరించిన టోపీవాడు అతని చేతిలో మాసిన కార్డొకటి పెట్టాడు.

"నా యిష్టం వచ్చిన చోటికి నేను పోతాను. మీ హోటలుకెందుకు రావాలి?" అన్నాడు గోకుల్.

"మా హోటలు చవుక. రోజుకు రెండున్నరే!" అన్నాడు టోపీదాసు.

"నాకు చవుక హోటళ్లంటే మంట."

"చవుక అయినా మా హోటలు చాలా బాగుంటుంది. కనుకనే మా హోటల్లో సినిమా స్టారు కూడా ఉంది. మూడు నెల్లనుంచీ మా హోటల్లోనే ఉంది. ఇంకెక్కడికీ వెళ్లదు."

ఈ మాటలు గోకుల్ చెవులకి రొమాన్సుదేవత యొక్క ఆహ్వానం లాగా వినిపించాయి. ఈ సమయానికి కూలివాడు సామాను లెఫ్ట్ లగేజీ ఆఫీస్‌కు తెచ్చాడు.

"ఒరే, నేను వీళ్ల మంచి హోటలుకు వెళుతున్నా. సామాను పట్టుకుపోతా" అన్నాడు గోకుల్.

అతనా మాట అనటం వ్యవధిగా టోపీదాసు కూలివాడిమీద పడి సామాను లాక్కుని కిందిపెట్టి, ఒక టాంగావాణ్ణి కేకేసి, గోకుల్ చేతిలో పర్సు తీసుకొని, పోర్టరుకు లెక్కప్రకారం డబ్బు ఇచ్చేసి, మరో అయిదు నిమిషాల్లో గోకుల్ ని సామానుతో సహా హోటలు దగ్గర దించాడు.

"పధ్నాలుగో నెంబరు గదిలో ప్రస్తుతం ఎవరూ లేరు. అక్కడ సామాను పెట్టిస్తాను. ఒక్కసారి ఇట్లా వస్తే ఆఫీసుగది ఉంది. మేనేజరు మీ పేరూ అదీ రిజిస్టరు చేసుకుంటాడు" అన్నాడు టోపీదాసుడు.

గోకుల్ ఆఫీసుగదిలో అడుగు పెడుతూనే ఒక మూల టెలిఫోనులో మాట్లాడుతున్న ఇరవైయేళ్ల అందమైన అమ్మాయిని చూశాడు. అతను ఆమె వంక అట్లా చూస్తూ ఉండగానే ఆమె, "ఛీరియో! బై, బై!" అంటూ టెలిఫోను పెట్టేసి అతని పక్కగా వొయ్యారంగా నడుచుకుంటూ ఆఫీసు గదిలో నుంచి బయటికి వెళ్లిపోయింది.

టోపీదాసు వొంగి, "అదిగో, మా సినిమా స్టార్, బిమ్లా!" అన్నాడు, "నేనబద్ధం ఎన్నటికీ ఆడను" అన్నట్టుగా.

"మీ పేరు?" అని మేనేజరు అడుగుతుండగానే గోకుల్ చర్రున బయటికి వెళ్లాడు.

సినిమా స్టార్ ఇరవయో నెంబరు గదిలోకి దూరి తలుపు వేసుకోవడం చూసి గబగబా వెళ్లి తలుపు తట్టాడు.

"కోన్?" అని శ్రావ్యమైన కంఠం ప్రశ్నించింది.

"తలుపు తీస్తారా?"

తలుపు తియ్యబడింది. తలుపు తెరుచుకున్న ఆరంగుళాల ఎడంలోనూ అందమైన బిమ్లా మొహం కనిపించింది.

"హలో, మిస్ బిమ్లా! మిమ్మల్ని ఇదివరకు చాలాసార్లు తెరమీద చూసాను గాని స్వయంగా చూడటం ఇదే మొదటిసారి" అన్నాడు గోకుల్.

"క్షమించండి. నేనిదివరకెన్నడూ సినిమాల్లో వేషం వెయ్యలేదు. ఇదే మొదలు" అంటూ బిమ్లా దభాలున తలుపు మూసింది.

గోకుల్ నిరుత్సాహపడలేదు. అతను ఆఫీసుగదికి తిరిగివచ్చి, "ఆమెను నేను బాగా ఎరుగుదును!... ఏమిటి అడుగుతున్నారు?" అన్నాడు.

గోకుల్ హోటల్లో అడుగుపెట్టి ఒక గంట అయింది. అతను గడ్డం చేసుకుని, వేడినీళ్లు స్నానం చేసి, చా తాగి, మంచి బట్టలు వేసుకుని బయటకు వచ్చి రోడ్డు మీద ట్రాముల, బస్సుల సందడి చూస్తూ నిలబడ్డాడు. అతనికళ్లు హోటలు మెట్లవైపే ఉన్నాయి.

అతనట్లా పది నిమిషాలు నిలబడి ఉంటాడు. అప్పటికి బిమ్లా హోటల్లో నుంచి బయటికి వచ్చి ఎటూ చూడకుండా నేరుగా ట్రాము ఆగేచోట పోయి నిలబడింది. గోకుల్ కూడా వెళ్లి ఆమెకు గజం వెనకగా నిలబడ్డాడు. కొద్దిసేపట్లో ట్రాము వచ్చింది. ఆమె అందులో ఎక్కింది. అతను కూడా ఎక్కాడు. ఆమె వెళ్లి ఒక సీటులో కూర్చుంది. అతను వెళ్లి ఆమె వెనక సీటులో కూర్చున్నాడు.

ట్రాము కండక్టరువచ్చి అతన్ని లేవగొట్టాడు. అది ఆడవాళ్ల సీటు. గోకుల్ చప్పున లేవక కండక్టరుతో వాదం పెట్టుకోవడంతో బిమ్లా వెనక్కు తిరిగి గోకుల్‌ని చూసి మొహం చిట్లించుకున్నది. గోకుల్ లేచి దగ్గిరలోనే మరో ఖాళీలో కూర్చున్నాడు.

బిమ్లా టిక్కెట్టు కొన్నది. ఫలానా చోటికని చెప్పలేదు. సరిగా చిల్లర డబ్బులు తీసి కండక్టరుకిచ్చినట్టుంది. ఎంత ఇచ్చింది గోకుల్ గమనించలేదు. కండక్టరు అతని దగ్గరికి వచ్చి "ఎక్కడికి?" అని అడిగినప్పుడు గోకుల్ అతని చేతిలో పావలా పెట్టి "ఈ ట్రాము ఎక్కడికి పోతే అక్కడికి" అన్నాడు.

కండక్టరు టిక్కెట్టు తీసి ఇచ్చే లోపుగా ట్రాము ఒకచోట ఆగింది. బిమ్లా చప్పున లేచి దిగి వెళ్లిపోయింది. గోకుల్ కూడా చివాలున లేచి కండక్టరు ఇయ్యబోయిన టిక్కెట్టు గాని, చిల్లర గాని పుచ్చుకోకుండా దిగి వెళ్లాడు.

ట్రాము సాగిపోయింది.

బిమ్లా నడిచి వెళ్లిపోతున్నది. అతను కూడా ఆమెను దాటిపోకుండా చూసుకుంటూ వెంబడించాడు. కొంతదూరం పోయి ఒకచోట ఆమె ఆగింది. అతను ఆమెకు రెండు మూడు గజాల దూరంలో ఆగాడు.

ఒక బస్సు వచ్చింది. ఆమె అందులో ఎక్కింది. అతనూ ఎక్కాడు. పైస్టాపులోనే ఆమె దిగిపోయింది. అతనూ దిగాడు. ఈసారి ఇద్దరూ టిక్కెట్లు పుచ్చుకోలేదు.

ఆమె ఈసారి అతన్ని సమీపించి కోపం పట్టలేక, "నన్నెందుకు వెంబడిస్తున్నావు? పోలీసును పిలిచేదా?" అన్నది.

"నీ వెంట ట్రాములోనూ బస్సులోనూ అంతమంది ప్రయాణం చేస్తుంటే లేని చిరాకు నేను చేస్తే దేనికి? నేనేం పాపం చేశాను?" అన్నాడు గోకుల్ అమాయకంగా.

దీనికేమనాలో తోచక ఆమె మాట మార్చి "ఇందాకకూడా నీ వాలకం నాకేమీ బాగాలేదు. నీవి పచ్చి అబద్ధాలు" అన్నది.

"ఎవరికన్నా సంతోషం కలుగుతుందని తోస్తే అబద్ధాలాడటానికి నాకభ్యంతరం లేదు. అబద్ధాలాడటంలో ఆరితేరినవాణ్ణి కాకపోవటం చేత దొరికిపోయాను. అది నా తప్పా?" అన్నాడతను.

"అబద్ధాలాడితే ఆడావు. నా వెంట పడ్డావేమిటి? నేనెటువంటి దాన్ననుకున్నావో గాని నేనటువంటి దాన్ని కాను. మొన్న నాతో ఇంటర్వ్యూ చేసిన వాడితో ఆ విషయం స్పష్టంగా చెప్పాను కూడానూ."

"అవును చదివినట్టు జ్ఞాపకం ఉంది. అదే పేపర్లో పడింది?"

మళ్లీ బిమ్లా మొహాన మబ్బులు కమ్మాయి.

"అది ఇంకా ఏ పేపర్లోనూ పడలేదు" అన్నదామె భయంకరమైన శాంతంతో.

"అందుకనే నాకా పేపరు పేరు జ్ఞాపకం రాలేదు" అన్నాడు గోకుల్ నదురూ, బెదురూ లేకుండా.

"నీ అంత సిగ్గుమాలిన వాణ్ని ఎక్కడా చూడలేదు. ఎక్కడికి వెళుతున్నావో వెళ్లిపో. అంతదాకా నేనిక్కణ్ణుంచి కదలను. నీతో మాట్లాడటమే నా పొరపాటు" అన్నది మొహం తిప్పుకుంటూ.

గోకుల్ జాలీగా "మీరిట్లా ఆగ్రహిస్తే నేనేం కాను? నేను వెళ్లదలచుకున్నది మీరు వెళ్లేచోటికే. అందువల్లనే నేను మీవెంట పడుతున్నానని మీకు అపోహ కలిగింది" అన్నాడు.

"ఇదో అబద్ధం! ఒక్క గుక్కన ఇన్ని అబద్ధాలాడే మనిషిని నేనెక్కడా చూడలేదు. నేను స్టూడియోకి వెళుతున్నాను. స్టూడియోకి దారి ఇది కాదు. మిమ్మల్ని తప్పించుకోవడానికి ట్రాము నుంచి దిగి బస్సెక్కాను, బస్సు దిగి ఇక్కడ నిలబడ్డాను" అన్నది బిమ్లా.

"నా ఖర్మ ఏమిటి చెప్పను! నాకా స్టూడియోకి దారి తెలీదు. మీరు నట్టేట్లోకిపోతే నేనూ అక్కడికి అనుసరించిపోవలసినవాణ్ణే తప్ప ఎటుపోవాలో నాకు మార్గం తెలీదు."

"స్టూడియో ఎక్కడున్నదీ కూడా తెలీకుండా అక్కడ మీకేం పనీ?"

"పనేమైనా దొరుకుతుందేమోననీ ఒకవేళ వాళ్లంతట వాళ్లివ్వకపోతే మీ శిఫార్సుమీద–"

"నా శిఫార్సా? మీరెవరు, నేనెవరు?"

"ఏడడుగులు కలిసి నడిస్తే ఆజన్మ స్నేహితులౌతారట. మనం ఇంత దూరం కలిసి వచ్చినాం–"

"మిమ్మల్ని గేటుదాటి లోపలికి రానివ్వద్దని శిఫార్సు చేస్తాను."

"అట్లాగే కానివ్వండి. నా అదృష్టాన్ని మీరు మార్చగలరా?"

"పని కోసం ఏ స్టూడియోకు వెళ్లినా వెళ్లొచ్చుగా? మా స్టూడియోకే దేనికీ రావటం?"

"మంచి స్టూడియో అయివుండాలి. లేకపోతే మీరు అందులో పనిచెయ్యరని నాకు తెలుసు."

"ఈ కబుర్లన్నీ నేను నమ్ముత్మాననే."

"అట్లా కాదు, మీరు పనిచేస్తున్నారు గనక మీ స్టూడియోలో తప్ప ఇంకెక్కడైనాసరే పని చేస్తానంటే పోనీ మీకు తృప్తికలుగుతుందా?"

"ఇటువంటి వితండవాదం నేనెక్కడా వినలేదు. మీకు స్టూడియోపని తెలుసా? ఏం పని చేస్తారు?"

"మిగిలిన పనులు నావల్ల కావు. మంచి కథ ఇద్దామనుకుంటున్నా."

"కథలు రాయటంలో మీకు అభ్యాసం ఉందా?"

"లేదు. అభ్యాసం ఉన్న వాళ్లని సినిమాల్లోకి తీసుకోరుటగా?"

"మీది దొంగవేషమో, అమాయకత్వమో కూడా నాకర్థం కావటం లేదు. మీతో రెండు నిమిషాలు మాట్లాడగానే మా మేనేజరు బయటికి గెంటేస్తాడు. చర్చలేదు."

"అది నే చూసుకుంటాను. మీ పుణ్యం ఉంటుంది, నన్నా మేనేజరు కళ్ల పడేద్దురూ! టాక్సీ డబ్బులు నేనన్నా ఇచ్చుకుంటా, ఈ ట్రాములూ బస్సులూ మానెయ్యండి" అన్నాడు గోకుల్.

"మీరేమీ అనుకోకుండా ఉంటే ఒక్క మాట చెబుతాను. మీ మాదిరిగా ఇంత సంపాదించుకునే సినిమాస్టారు కూడా ట్రాముల్లోనూ, బస్సుల్లోనూ ప్రయాణం చెయ్యటమూ, చవుక హోటళ్లలో ఉండటమూ ఏమీ బాగా లేదు. మీవంటి వాళ్లమూలంగానే డబ్బు పొట్టి పాపిష్టిదై పోతోంది. లేని వాళ్లు లేక ఏడుస్తుంటే ఉన్నవాళ్లు ఇట్లా దరిద్రం తెచ్చి పెట్టుకోవటమేమిటి? డబ్బు పోగేసుకుని ఏం చేస్తారు? అది చూసి ఆనందిస్తారా?" అన్నాడు గోకుల్.

ఈ మాటకామెకు కోపం రాలేదు.

"నీకు డబ్బు విలువ ఏమీ తెలిసినట్టు కనపడదు. నీకా ఉద్యోగం లేదు. ఇప్పుడే ఈ మహాపట్టణంలో అడుగు పెట్టావు. అర్హతలేని ఉద్యోగం కోసం ప్రయత్నించటానికి డబ్బు పోసి టాక్సీ మీద పోతున్నావు ! రోజుకు రెండున్నర చొప్పున హోటలుకు కుమ్మరిస్తున్నావు. ఈ లెక్కన నీ డబ్బు రేపీపాటికి అయిపోవచ్చు. మరో నెల దాకా నువు ఉద్యోగం లేకుండానూ చేతిలో దమ్మిడి లేకుండానూ గడపవలసి రావచ్చు. నీ పాట్లేమిటో ఆలోచించుకున్నావా? నిన్ను చూస్తే చదువుకున్న వాడిలా కనిపిస్తున్నావు. లోక జ్ఞానంలేని చదువు దేనికి ?... అవును, నాకు దారిద్ర్యమంటే భయం. దాని స్వరూపం నాకు తెలుసు. మా అమ్మ పదిరూపాయలు ఖరీదు చేసే ఇంజక్షన్లకు డబ్బులేక నాకళ్ల ఎదుట చచ్చిపోయింది తెలుసా? అదే జబ్బు లివర్ ఇంజక్షన్లతో నయం చేసుకుని దుండు ముక్కల్లే తిరుగుతున్నవాళ్లని నేనెరుగుదును. పది రూపాయలు లేక నాతల్లి చచ్చిపోయింది. నాకు డబ్బువిలువ తెలుసు. అదృష్టవశాత్తు నాకు సంపాదించుకునే అవకాశం దొరికింది. అందులో ప్రతిచిల్లిగవ్వా మిగులుస్తాను. అవకాశం ఎంత కాలం ఉంటుందో ఎవరు చెప్పగలరు? చవుక హోటల్లో ఉంటున్నానంటే అందువల్ల నాకు డబ్బు ఆదాకావటమే కాక నాకు ఎంతో క్షేమం ఉంది. మొగవాళ్లు నూటికి తొంభైతొమ్మిది మంది నీవంటి వాళ్లే. వాళ్లను అంత దూరంలో ఉంచటానికి హోటలు గదిని మించిన అంగ రక్షలేదు. ఏదేనా ఇల్లు అద్దెకు తీసుకుంటే నా మానం ఏనాడో హరించుకు పొయ్యేది. నేను చాలా పాతకాలపు దాన్ని!"

"దారిద్ర్యం చాలా పాపిష్టిది. అది జీవితపు విలువలను పాడుచేస్తుంది. మీ అమ్మ పది రూపాయలు లేక చచ్చిపోబట్టే నువు డబ్బుకు వెర్రి ప్రాముఖ్యం ఇస్తున్నావు. అందుకే మాయదారి ద్రవ్యమంటే నాకు తగని మంట."

"మంట అని తప్పించుకోగలిగావా?" అన్నది బిమ్లా.

"లేదు. అది వెంట వుంటూనే వుంది" అన్నాడు గోకుల్ ఆమెకేసి చూసి నిట్టూర్చి....

టాక్సీ స్టూడియో చేరింది.

గోకుల్ ని మేనేజరు దగ్గిర దిగవిడిచి బిమ్లా మ్యూజిక్ రూముకు వెళ్లింది.

గోకుల్ ఆమె స్నేహితుడనుకుని మేనేజరు అతన్ని చాలా గొప్పగా గౌరవించాడు. కుర్చీలో కూర్చోపెట్టి సిగిరెట్ కేసు ముందుపెట్టాడు.

"మంచి ఆర్టిస్టు చూడండి, మేము ఆమెను ఎంత బాగా పైకి తెస్తామో! బొంబాయిలో ఇటువంటి కారెక్టర్ ప్లేయర్ లేదనేట్టు చేస్తాం. ఆమె కోసం ఇప్పుడు తీసే కథలో ఎన్ని మార్పులు చేశామో తెలుసా?" అన్నాడు మేనేజరు.

"ఆమె కోసం ప్రత్యేకించి కథలు రాసుకోవాలి. అప్పుడు గాని ఆమెకు నిజమైన ఖ్యాతి రాదు."

"అవునవును ఈ పిక్చరు అయిపోయే లోపల మా మున్షీజీకి బిమ్లా ఎటువంటి యాక్టరో అర్థమైపోతుంది. అప్పుడు ఆమెకోసం కథలు రాసుకుంటాం."

"అదే పొరపాటు. ఆమె కోసం కథ రాస్తే నాబోటివాడు, చిన్ననాటి నుండీ ఎరిగిన వాడు రాయాలి."

"ఏమైనా మీ మనస్సులో ఉందా?" అని లాలూచీగా అడిగాడు మేనేజరు.

"ఒకటా? కనీసం దజనున్నాయి. ఈ బిగినింగ్ ఎట్లా వుంటుదో చూడండి. బిమ్లా పదహారేళ్ల పిల్ల. అతి బీద సంసారం. గుడిసె. ఒక మూల కుండలూ, కుక్కిమంచం. సాఫ్ట్ లైటింగ్. కుక్కిమంచంలో చచ్చిపోతున్న తల్లి. డాక్టరు వస్తాడు – పొట్టివాకిలిలో నుంచి వంగి–"

"మంచి టచ్!"

"– రోగిని పరీక్షిస్తాడు. ఇంజక్షను ఇవ్వాలి. తప్పక బతుకుతుంది. బిమ్లా మొహాన ఆశ, సంతోషం. ఇంజక్షన్లకి ఇరవై రూపాయలవుతుంది. నిరాశ, దు:ఖం! ఇరవై రూపాయలేవీ?"

"గుడ్!"

"తండ్రి తాగుబోతు! మెళ్లో గొలుసు ఒక్కటీ అమ్మేసి తండ్రి చేతికిచ్చి ఇంజక్షన్లు తెమ్మంటుంది. తండ్రి సొమ్మంతా తాగేస్తాడు. కామెడీ సీన్. తాగుబోతుల పాట."

"చెప్పండి, చెప్పండి!"

"తాగుబోతులచేత మీరెంత సేపటికీ కామిక్ పాటలు పాడిస్తారు. వాళ్లచేత ఒక భజన్ పాడించండి, ఎంత ఎఫెక్ట్ వస్తుందో ! చాలా గొప్పగా వుంటుంది."

"అవునవును, మళ్లీ బిమ్లా దగ్గిరికి రండి."

"వచ్చేస్తున్నా. బిమ్లా పాపం ఏం చేయగలదు? డాక్టరుకు తన శరీరం ఇచ్చేసి తల్లిని బతికించుకోవటం తప్పు?"

"చెప్పండి, చెప్పండి."

"డాక్టరు ఆమెను చెరుస్తాడా?"

"గొప్ప సీను. డాక్టరు క్లోజ్ ఇన్. బాటమ్ లైటింగ్. వాడి కళ్లల్లో కామం. విలన్! అప్పుడు హీరో వచ్చి రక్షిస్తాడు. సరిగా చెప్పానా?"

గోకుల్ మేనేజరు కేసి చాలా నిరసనగా చూసి, "గలత్. ఇంకా హీరో వేరే వున్నాడా ఏమిటి? ఆ డాక్టరే హీరో!" అన్నాడు.

మేనేజరు లేచి కూర్చుని "ఎట్లాగూ?" అన్నాడు.

"అవును డాక్టరుకు హృదయం ఉంది. పదహారేళ్ల అమాయకురాలు తల్లి ప్రాణంకోసం మానత్యాగం చేస్తుంటే కదిలి పోడూ? అతని జీవితమంతా మారిపోతుంది. బిమ్లా డాక్టరును ప్రేమిస్తుంది. తరవాత తరువాత అతనికి ఆమెను కన్నెత్తి చూడటానికి కూడా సాహసముండదుగా? పోయిన కొద్దీ ప్లాట్ అద్భుతం లెండి! మీకు ఓపెనింగ్ సీక్వెన్స్ మటుకే చెప్పాను" అన్నాడు గోకుల్. సినిమా టెక్నిక్ గురించి అతను అంతో ఇంతో చదివి ఉండటం వుపకరించింది.

"ఈ కథ మా కెప్పుడు రాసి ఇస్తారు?"

"మీరు డబ్బిచ్చుకోలేరు. వేలకు విలువైన కథ."

"అయిదు వందలిస్తాను. కావలిస్తే సహం డబ్బు ఇప్పుడే అడ్వాన్స్ ఇస్తాను" అంటూ మేనేజరు చెక్ పుస్తకం తీశాడు.

"అయిదు వందల కోసమైతే కథ రాయను గానీ, బిమ్లా కోసం ఈ కథ మీకిచ్చేస్తాను. నా పేరు–"

స్టూడియోనుంచి బిమ్లా తిరిగి వచ్చేదాకా గోకుల్ స్టూడియోలోనే వుండి అంతా చూశాడు. ఈ వ్యాపారంలో డబ్బున్నదని అతనికి చాలా కాలంగా నమ్మకం ఉందిగానీ అతని అన్నగారు ఒప్పుకోడు. ఈ బిమ్లాను తను పెళ్లాడి ఆమెతో సహా సినిమా కంపెనీ పెట్టి లక్షలు సంపాదించాలని గోకుల్ నిశ్చయించుకున్నాడు. ఇది జరుగుతుందా, సంభవమా, సాధ్యమా అనే ప్రశ్నలు అతనికి కలగలేదు.

రోజూ బిమ్లా స్టూడియో కారు మీదనే వెళుతుంది. ఉదయం కార్లన్నీ అందుబాటులో లేకుండా పోయాయి. సాయంకాలం మామూలుగానే ఆమె కోసం కారు వేచి వుంది. గోకుల్ కూడా ఆ కారులోనే వచ్చేశాడు.

దారిలో ఆమె అతన్ని, "నీకు పని కుదిరిందా?" అని కొంచెం హేళనగా అడిగింది. అతను చెక్ తీసి చూపించాడు.

"నీ పిక్చరుకు కథ రాస్తున్నాను. మనిద్దరమూ ఈవిధంగా దగ్గిరికి రావటం నాకెంతో సంతోషంగా వుంది. ఇది మన స్నేహానికి మొదటి మెట్టు కాదూ?" అన్నాడతను.

"నాకు స్నేహాల్లో నమ్మకం లేదు."

"నమ్మకం కలిగించేటందుకు నాకు అవకాశం ఇయ్యి. మనిద్దరికీ పెళ్లయి నాక ఆరు నెల్లలోపల నీ నమ్మకాలన్నీ మార్చేస్తాను."

బిమ్లా నోట మాటరాలేదు. కారు ఆపి అతన్ని దించేద్దామనుకుంది. కాని లోపలనుంచి ఏదో నీరసం పైకి రాసాగింది. తనకే తెలియకుండా ఆమె విరగబడి నవ్వేసింది.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"నీ సాహసానికి !"

"ఏమిటి నా సాహసం?"

"నన్ను పెళ్లాడాలని. నీకు నిజంగా పిచ్చి. నీ ముష్టి చెక్ చూసి పెళ్లాడేస్తాననుకున్నావా?"

"ఇది సహామే. కథ రాసినాక ఇటువంటి చెక్కు మరోటి ఇస్తారు."

"పిచ్చివాడా! నాకు వందలూ వేలూ ఒక లెక్కలోనివి కావు. నేను పెళ్లాడితే లక్షాధికార్ని పెళ్లాడతాను. పెళ్లి చేసుకున్నాక ఈ దిక్కుమాలిన సినిమాల్లో వేస్తాననుకున్నావా? వొట్టిమాట. అధమం ఒక లక్షఅయినా నా పేర పెట్టిన వాణ్ణే పెళ్లాడతాను. కనక వెర్రి ఆశలు మాను."

"నీ పద్ధతి నాకేమీ బాగాలేదు. నువ్వు చాలా మంచి ఆర్టిస్టువని బట్టతల వాడంటున్నాడు, వాడి అభిప్రాయాన్ని నేను చాలా విశ్వసిస్తాను. నాకథ చూసి ఎంతో మెచ్చుకున్నాడు."

"కథంటే జ్ఞాపకం వచ్చింది . మర్యాదగా ఆచెక్కు మా మేనేజరుకు తిరిగి ఇచ్చెయ్యి. నీకు కథలు రాయటం రాదని చెప్పు."

"అతడు నమ్మడుగా!"

"నువ్వతన్ని ఎట్లా బుట్టలో వేశావో నాకర్థం కావటం లేదు. రేపు నిజంగా కథ రాయవలిసి వస్తే ఏం చేద్దామని నీ ఉద్దేశం? నీ అంత విచిత్రమైన మనిషిని నేనెక్కడా చూడలేదు."

"నువ్వా మాట అనుకోవటం నాకు మంచిది. నాఅంత విచిత్రమైన మనిషి నిన్ను పెళ్లడతానంటుంటే నువ్వువెళ్లి ఒక నాటు లక్షాధికార్ని పెళ్లాడతావా? ఇక కథ రాయటమంటావూ? అందులో నాకేమీ కష్టం కనిపించలేదు. నేను ఏం రాయాలో మీ

మేనేజరే చెప్పేస్తున్నాడు. నేను కథ రాయను, మీ మేనేజరు చేత రాయిస్తాను. రాయటం కన్నా రాయించటం ఇంకా గొప్ప."

"నీకు నమ్మకంగా పిచ్చే!" అన్నది బిమ్లా.

కారు హోటలుకు వచ్చింది. ఇద్దరూ కలిసి మెట్లెక్కి వచ్చి ఎవరి గదికి వారు పోబోయేటప్పుడు గోకుల్, "మన పెళ్లి విషయం దీర్ఘంగా ఆలోచించు. రేపు పొద్దుటికల్లా తేలిపోవాలి. నాకు బోలెడన్ని ప్లానులున్నాయి" అన్నాడు.

"గుడ్ నైట్" అన్నది బిమ్లా.

కాని గోకుల్ మరో గంటలో ఆమె గది ముందు తయారైనాడు.

"ఎవరు వారు?" అన్నది బిమ్లా.

"నేనే మున్నీజీని!"

కాసేపు సందేహించి బిమ్లా తలుపు తీసింది. గోకుల్ పిచ్చివాడు కావచ్చు గానీ అతని రకం పిచ్చిలో కొంత ఆనందం ఉందనీ, అతని పిచ్చి అపాయకరం కాదనీ ఆమె నిశ్చయించుకున్నది.

"ఒక సందేహం తీర్చిపోదామని వచ్చాను. నీవంటి వాళ్లకి ఇటువంటి సందేహం రావటం సహజం. నాకు అందరిలాగా సినిమా తారలంటే వ్యామోహం అనుకున్నావేమో. అటువంటిదేమీ లేదు. నాకు వాళ్లంటే పరమ అసహ్యం. ఈ విషయం నీకు తెలిస్తే నన్ను పెళ్లాడటానికి సులభంగా నిశ్చయించుకుంటావని చెబుతున్నాను" అన్నాడతను వాకిట్లో నిలబడి.

"హాస్యానికేం గానీ, నేను మాత్రం నిన్ను ఒక్కనాటికీ పెళ్లాడను. నువ్వా విషయం రూఢిగా తెలుసుకోవడం మంచిది. నువ్వు చాలా మంచివాడివే కావచ్చు. కానీ లక్షకు తక్కువ అయితే నేను అమ్ముడుపోను. ఇది రూఢి" అన్నది బిమ్లా.

"అమ్ముడు పోవటమనే మాట వింటేనే నాకు జర్రులు పాకినట్టుంది. నిన్ను దారిద్ర్యం ఇట్లా చేసిందంటే నాకు ఆశ్చర్యంగా వుంది. ఇక నేనా? నేను అనుకున్నది మానేవాణ్ని కాను. నువ్వునిజంగా డబ్బుకోసం మొండితనం చేస్తే లక్ష సంపాదించనన్నా సంపాదిస్తానుగానీ నిన్ను పెళ్లాడక మానను."

"లక్ష రూపాయలు ఎక్కడ సంపాదిస్తావు? నీకంత పిచ్చివుందా? వున్నట్టు నటిస్తున్నావా?"

"రేపీపాటికి లక్షరూపాయలు సంపాదించకపోతే ఏ రైలు కిందనో పడి అయినా పోతాను. మానవ జన్మ ఎత్తినందుకు ఏదైనా సాధించాలి గానీ కాళ్లు పారజాస్తారూ?"

అతను వెళ్లిపోయినాడు. అతని కోతలకేం లెమ్మని బిమ్లా ఊరుకున్నది. కాని

ఆరాత్రి నిద్రపొయ్యే లోపుగా ఆమె తను అతని భార్య అయినట్టు ఊహించుకోవటానికి ప్రయత్నించింది. అనేక దృశ్యాలు సులభంగా ఆమె మనస్సులో గోచరించాయి. అతన్ని పెళ్లాడటం చాలా సులభంగా చేసేపనిగా తోచింది. అతనిలో ఏదో ఆకర్షణ ఉన్నది. పైకి తియ్యని మాటలు చెబుతూ తడిగుడ్డలతో గొంతుకోసే వాళ్లని ఆమె ఎరుగును. వాళ్లతో పోలిస్తే గోకుల్ ఎంతో గొప్పగా కనిపించాడు. అతనితో దరిద్రం కూడా సంతోషంగానే అనుభవించవచ్చునని ఆమెకు తోచింది. ఈ మాట అనిపించగానే బిమ్లా తన మనస్సు రాయిచేసుకుని అతన్ని గురించి ఆలోచించటం మానేసి నిద్రపోయింది.

మర్నాడుదయం అతని అలికిడి లేదు. నడవాలో గానీ ఆఫీసు గదిలోగానీ అతని గొంతు వినిపించలేదు. టీ తెచ్చిన కుర్రాడితో " పధ్నాలుగో నెంబరు పెద్దమనిషి ఏమైనాడు?" అని మాటవరసకు అడిగినట్టుగా అన్నది.

"గదిలో లేదు. ఎక్కడికి వెళ్లాడో తెలీదు" అన్నాడు నౌకరు.

పదిగంటలకు బిమ్లా కోసం కారు వచ్చింది. ఆమె అందులో ఎక్కింది. ఒక చోట తన కారు ఇంకో కారును కొట్టుకున్నంత పని అయింది. కుయ్యో మని రెండు కార్ల బ్రేకులు భయంకరమైన శబ్దం చేశాయి. బిమ్లా గొంతులోకి ఎగిరినట్టయింది. ఒక్క అర క్షణం పాటు తన కారుకింద గోకుల్ పడ్డట్టుగా ఆమెకనిపించింది.

మళ్లీ కారు సాగింది. కానీ ఆమె మనస్సు మామూలు కాలేదు. గోకుల్‌కు ఏదో మూడిందనే నమ్మకం ఆమెను పట్టుకుని వదల్లేదు.

స్టూడియోలో వుండగా కూడా అప్పుడప్పుడు గోకుల్ ఆలోచన వస్తూనే వుంది. మధ్యమధ్య అతని మీద కోపం కూడా రాసాగింది. తనకు డబ్బు మీద వున్న గౌరవమంతా అతనెందుకు పాడు చెయ్యాలి? అతను వట్టి మూర్ఖుడు! డబ్బూ ఉద్యోగం లేనివాడు ఈ ఆటలేమిటి? ఏమిటి అతని ధైర్యం? ఒక రోజూ, రెండు రోజులూ డబ్బును ధిక్కరించటం సరదాగానే ఉంటుంది. జీవితమంతా ఇట్లా జరపగలడా? ఇతనిట్లా ఇంతకాలం మటుకు ఎట్లా జరుపుకొస్తున్నాడు? తను చిన్నతనంలోనే నేర్చుకున్న పాఠం ఇతనింతకాలం నేర్చుకోకుండా ఎట్లా ఉన్నాడు? తను బొంబాయివచ్చిన కొత్తల్లో, ఉద్యోగం దొరక్కమునుపు, సి.పి.టాంక్ దగ్గిర ఒక సత్రంలో వారంరోజులున్న సంగతి జ్ఞాపకం వచ్చి, హోటల్లో చేరిన గోకుల్ సాహసానికి ఆశ్చర్యం కలిగింది.

"ఇది మగవాళ్ల ప్రపంచం. అందుకనే వాళ్లు ఆడవాళ్లల్లే చప్పున భయపడరు" అనుకున్నది.

స్టూడియో నుంచి హోటలుకు తిరిగి రాగానే గోకుల్ కనిపిస్తాడనుకున్నది. కాని అతని జాడ లేదు. అతను రోజల్లా పత్తాలేడని హోటల్ కుర్రాడు చెప్పాడు. అతను దేనికిందోపడి చచ్చి ఉంటాడని ఆమెకు రూఢి అయింది. రోజల్లా అతను ఎక్కడ అన్నం

తిన్నట్టు? బట్టలేం వేసుకున్నట్టు? ఈ మహాపట్టణంలో అతనికెవరుంటారు? ఎవరన్నా ఉంటే ఈ దిక్కుమాలిన హోటల్లో ఉంటాడా?

ఒకవేళ చెక్ మార్చుకుని అది ఖర్చు పెట్టటానికి ఊరంతా తిరుగుతున్నాడేమో అనుకోవటానికైనా ఆ చెక్కు తనదగ్గిరే ఉంది. స్టూడియో మేనేజరుకి తిరిగి ఇస్తానని బెదిరించటానికి తన దగ్గిర ఉంచుకున్నది. దాన్ని అతను తిరిగి తీసుకోనన్నా లేదు. డబ్బంటే అతనికెంత నిర్లక్ష్యం! అన్నం లేక చచ్చినా బతికినన్నాళ్లూ గోకుల్‌లాగా బతికి ఆకలికి చచ్చినా గొప్పేనేమోనని ఆమెకనిపించింది.

ఆ రాత్రి పన్నెండు గంటలదాకా అతను రాలేదు. మర్నాడుదయాన కూడా రాలేదు. బిమ్లా పేపరు తెప్పించుకుని ఏ రైలు కిందనైనా ఎవరన్నా చచ్చారేమోనని తిరగవేసి చూసింది. ఏమీ కనిపించలేదు.

ఆ రోజు స్టూడియోలో ఆమె ఏం చేసిందీ ఆమెకే తెలియదు. సాయంకాలం ఇంటికి వచ్చేటప్పటికి ఆమెకు చెప్పలేని నీరసం పట్టుకుంది. గోకుల్ అయిపులేడు.

రాత్రి పదిగంటలకు ఆమెకు ఒక ఆలోచన తట్టింది. ఆఫీసుగదికి వెళ్లి పోలీసు స్టేషనుకు టెలిఫోను చేసింది – ఎవరన్నా ఆత్మహత్య చేసుకున్నారా అని.

"ఎవరన్నా ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారా?" అని పోలీసులు అడిగారు. బిమ్లాకు తెలీదు. ఆమె గోకుల్ పేరూ, వయసూ, వర్ణనా ఇచ్చింది.

"ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నించటం పెద్దనేరం. ఆ మనిషి దొరికితే ఎరెస్టు చేస్తాం" అన్నాడు పోలీసు ఇన్స్పెక్టరు.

ఈ సంగతి ఆమె ఎరగదు. కాని అతన్ని ఎరెస్టు చెయ్యవలసిందేనని ఆమె రూఢి చేసుకున్నది. గోకుల్ వంటి వాళ్లకి అట్లా కాని బుద్ధిరాదని నిశ్చయించుకున్నది. ఆమె మనస్సు చాలా తేలికయింది. అతన్ని పోలీసులు పట్టుకుంటే అతను ఏ రైలుకిందా పడలేడనే ఆమె తృప్తి. అయితే ఆ సంగతి ఆమెకు తెలీదు. అతను జైల్లో పడతాడనే తనకు తృప్తిగా ఉందనుకున్నది.

అయినా ఆమెకు ఆ రాత్రి సరిగా అన్నం రుచించలేదు. నిద్ర అసలే పట్టలేదు. ఆఫీసుగదిలో గడియారం ఒంటిగంట కొట్టటం కూడా ఆమె విన్నది. ఆ తరవాత కొద్ది సేపటికే ఆమెకు నిద్రపట్టి ఉండాలి. అకస్మాత్తుగా చివాలున లేచి కూచుంది. లైటు వెలుగుతూనే ఉంది. తలుపెవరో మెల్లిగా తట్టిన చప్పుడయింది.

"కోన్?" అన్నది బిమ్లా.

"నేను, గోకుల్!"

బిమ్లా చెంగున వెళ్లి తలుపు తీసింది.

గోకుల్ లోపలికొచ్చాడు. అతని మొహాన ఏ వికారమూ లేదు. బిమ్లాకు ఒకేసారి అతన్ని లాగి చెంపపగిలేట్టు కొడదామనీ గట్టిగా కావలించుకుందామనీ కూడా అనిపించింది.

అతను జేబులోనుంచి చిన్న కాగితం ముక్కతీసి ఆమె చేతిలో పెట్టాడు. బిమ్లా విప్పి చూసుకుంది. అది లక్ష రూపాయల చెక్కు.

"ఇదుగో నీ లక్ష. దీంతో మనం కొత్త ఫిలిం కంపెనీ పెడుతున్నాం. నీకు సహాంభాగం. నీయిష్టం వచ్చిన మేనేజరునూ, డైరెక్టరునూ, మిగతావాళ్లనీ పెట్టుకో. నా చేత కథలు రాయించుకోదలుచుకుంటే, కథకి అయిదు వందలు పుచ్చుకుంటాను!" అని నవ్వాడు.

"నన్నెందుకిట్లా మోసం చేస్తావు? నన్నేడిపిస్తే నీకేం వొరుగుతుంది? నేను నీకేం ద్రోహం చేశాను?" అని చప్పున బిమ్లా ఏడవసాగింది.

గోకుల్ ఆమెను దగ్గిరికి తీసుకుని ఓదార్చుతూ, "నేను మోసం చెయ్యటం లేదు బిమ్లా. ఇదంతా నిజమే. ఈ లక్షకాదు నాకింకా డబ్బుంది. అయితే మా అన్నగారు దీనికి ఒప్పుకోవటానికి చాలా రాద్ధాంతం చేశాడు. నిన్ను చూసినాక, మన ఫిలిం బయటికి వచ్చినాక ఇంకా ఎంత డబ్బయినా వస్తుంది. దిగులుపడకు" అన్నాడు.

వాళ్లిద్దరూ కలిసి కంపెనీ పెట్టటమూ చిత్రాలు తియ్యటమూ అందరికీ తెలిసిన విషయమే.

*మొదటి ముద్రణ: తెలుగు సినిమా, నవంబర్ 1948*